అట్టడుగు జీవులకు సంక్షేమ అందలం


గడిగరేవులలో పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీరు(ఫైల్)

- బడుగుల బతుకుల్లో వెలుగులు నింపుతున్న పథకాలు
- అర్హుల ఖాతాలకు నేరుగా సంక్షేమ ఫలాలు

గడివేముల: రోజూగొడ్డు చాకిరీ.. లాభసాటిగా లేని వ్యవసాయం..స్వయం ఉపాధి పొందుదామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు..ఇవీ నాలుగున్నరేళ్ల క్రితం బడుగుల బతుకులు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక న వరత్నాల పథకాలు వారి జీవితాల్లో వెలుగునింపా యి. కుల,మత,రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందడంతో వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తుండటంతో అన్నివర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ సచివాలయం పేరు	డీబీటీ ద్వారా లబ్ధి రూ.కోట్లలో	నాన్-డీబీటీ ద్వారా లబ్ధి రూ.కోట్లలో	మొత్తం
బిలకలగూడూరు	21,71,36,363	8,88,70,478	30,60,06,841
బూజునూరు	9,76,63,467	3,53,39,172	13,30,02,639
చిందుకూరు	12,67,12,624	4,09,38,654	16,76,51,278
గడిగరేవుల	12,06,43,241	4,13,16,499	16,19,59,740
గడివేముల-1	13,89,53,957	5,28,47,391	19,18,01,348
గడివేముల -2	14,55,74,174	3,92,33,686	18,48,07,860
దుర్వేశి	12,06,43,241	4,13,16,499	16,19,59,740
గని	17,97,52,398	6,33,69,659	24,31,22,057
కరిమద్దెల	19,85,03,293	7,68,95,837	27,53,99,130
కొరటమద్ది	85775417	3,54,09,940	12,11,85,357
కొర్రపొలూరు	9,41,54,887	3,16,54,000	12,58,08,887
మంచాలకట్ట	15,93,47,708	6,33,66,485	22,27,14,193
ఒండుట్ల	11,16,13,620	3,52,85,475	14,68,99,095
పెసరవాయి	17,33,16,688	4,88,28,889	22,21,45,577

సంతోషంగా ఉంది



నా భర్త రామగోవిందు. మాకు రైతు భరోసా వస్తుంది. పంటల బీమా అందింది. నాకు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాల్లో ప్రయోజనం పొందింది. వీటి ద్వారా వచ్చిన డబ్బుతో వ్యవసాయం చేసుకుంటూనే రెండు గేదెల్ని కొనుక్కొని పెంచుకుంటున్నా. నా కుమారుడు ఆదినారాయణకు కూడా రైతు భరోసా డబ్బు పడింది. మా కోడలు మహేశ్వరికి అమ్మఒడి, సున్నావడ్డీ పథకాలతో లబ్ధి చేకూరింది. జగనన్న కాలనీలో స్థలం ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలతో ఇల్లు సైతం నిర్మించుకున్నాం. నాలుగేళ్ల క్రితం కుటుంబం గడవమే కష్టంగా ఉండేది. ఇప్పుడు ఉన్నంతలో జీవితం హాయిగా సాగిపోతుంది.

– మండ్ల గోవిందమ్మ, సోమాపురం

జగనన్నకు రుణ పడిఉంటాం



గతంలో చేతినిండా పని ఉన్నా ఆదాయం తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఆదాయం ఎక్కువగా ఉన్నా చేతి నిండా పని ఉండటం లేదు. ఆధునిక యంత్రాలు రావడంతో మా కులవృత్తికి ఆదరణ తగ్గింది. కులవృత్తులను ఆదుకునే దిశగా సీఎం జగన్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయంతో మళ్లీ మా కులవృత్తికి జీవం వచ్చింది. గతంలో అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం మాకు సాయం చేయలేదు. ఇప్పుడు జగనన్న చేదోడు పథకం కింద నాకు రూ.10 వేలు నా ఖాతాలో వేశారు. జగనన్నకు రుణ పడి ఉంటాం.

– చాకలి రవణమ్మ, గడివేముల గ్రామం

గతంలో ఏ ప్రభుత్వం అలోచించలేదు



గతంలో ఏ ప్రభుత్వం కూడా మహిళల గురించి ఎనాడూ పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం పొదుపు మహిళలను మోసం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పథకం ద్వారా మండలంలోని 597 గ్రూపుల్లో ఉన్న 7,164 మంది సభ్యులకు ఒక్కో విడతలో రూ.21,22,272 చొప్పున నాలుగు విడతలు మంజూరు చేశారు. 45 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి వైఎస్సార్ చేయూతతో పాటు బ్యాంకు నుంచి లోన్లు ఇప్పించి స్వయంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. ఆర్థికంగా వెనకబడిన కులాల మహిళలకు సైతం పథకాల లబ్ధిని చేకూర్చడం ఎంతో బాగుంది. మహిళల కోసం ఇన్ని పథకాలు అందించిన సీఎంకు పొదుపు మహిళల తరఫున కృతజ్ఞతలు.

– బిదుదూరి అనురాధ, ఐక్యసంఘం అధ్యక్షురాలు, గడివేముల

క్లుప్తంగా

పెరిగిన బుగ్గరామేశ్వరుని హుండీ ఆదాయం


హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ఓర్వకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గలోని బుగ్గరామేశ్వరుని హుండి ఆదాయం పెరిగినట్లు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. గురువారం కాల్వబుగ్గ దేవస్థానంలో స్వాములవారి హుండీ కానుకలను లెక్కింపు చేపట్టారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేపట్టిన లెక్కింపులో గతేడాది ఐదు నెలలకు గాను రూ.4,14,444లు కానుకలు రాగా,ఈ ఏడాది ఎనిమిది నెలలకు సంబంధించి రూ.6,37,414 వచ్చినట్లు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.1,39,405 అదనంగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు బాలాజీ సేవా ట్రస్టు బృందం సభ్యులు, హుసేనాపురం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు నాగేశయ్య, వెంకటేశ్వరమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న బహింగ వేలంపాట

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామక్రిష్ణ గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, పటాల అంగళ్లు నిర్వహించుకునేందుకు ఏడాది అనుమతికి ఈ వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. టెంకాయలు వేలానికి రూ.1లక్ష, పూలు, పటాల అంగళ్లకు రూ. 10వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ శకుంతల సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-2ను ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయానికి పిలిపించి మందలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వలంటీర్లతో కుల గణన, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలు పురగోతి సాధించాలని ఎంపీడీఓ సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామ సమీపంలో ఉన్న తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక టాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐతిమ్మారెడ్డి తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.358 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

సన్మానం


బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: ఎంపీడీఓగా పనిచేస్తూ అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన చంద్రశేఖర్‌ను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ, మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. అలాగే కోడుమూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ దివ్యను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రప్ప,ఏఓ రవిప్రకాష్, సర్పంచు భాగ్యరత్న, మండల ఉపాధ్యక్షురాలు మాధవి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం

పాణ్యం: మండలంలో పన్ను వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఈఓఆర్డీ సులోచన సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ 2023–24ఆర్థిక సంవత్సారానికి సంబధించి పన్ను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్లు, పరిశ్రమలు, ఇతర వ్యాపార సముదాయల పన్ను వసూలు చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈనెల చివరి నాటికి వసూల చేయాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు. ఆయన వివరాల మేరకు పిన్నాపురం గ్రామానికి చెందిన శీలం వెంకటరాముడు(43)తనకున్న అరెకర పొలంలో సోలార్ పరిశ్రమకు పోవడంతో బతుకుదెరువు కోసం తమ్మరాజుపల్లెలో ఉంటున్నాడు. పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో అప్పులు అయ్యాయి. ఆదివారం కూలీ పనికి వెళ్లిన వెంకటరాముడు పొలం వద్ద పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన పలువురు కూలీలు, కుటుంబ సభ్యులు నంద్యాల సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య మద్దమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



ఆదోనిరూరల్: ఆదోని పట్టణశివారు ప్రాంతంలో దాదాపీర్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తుండగా అగ్గిరవ్వలు పడి వరిగడ్డి పూర్తిగా దగ్ధమయ్యింది. వివరాల్లోకి వెళితే.. సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన మలిగప్ప కురుకుంద గ్రామానికి పశువుల మేత కోసం వరిగడ్డిని తన బంధువులకు ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఫ్యాక్టరీ సమీపంలో చెత్తను తగలబెట్టిన నిప్పురవ్వలు పడి వరిగడ్డికి నిప్పంటుకుంది. డ్రైవర్ ట్రాలీని వదిలి వెళ్లడంతో గడ్డితో పాటు ట్రాలీ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంవత్సరం వర్షాలు సరైన సమయంలో పడకపోవడంతో ఉన్న కాస్త మేతను తరలిస్తుండగా మార్గ మధ్యలో ఇలా జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

ఆసరా పంపిణీ సభ ఏర్పాట్ల పరిశీలన


సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: పొదుపు సంఘాలకు ప్రభుత్వం అందించే వైఎస్సార్ ఆసరా పంపిణీకి సంబంధించి శనివారం నిర్వహించనున్న సభ ప్రాంగణాన్ని గురువారం అధికారులు పరిశీలించారు. ఏపీఎం ప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వెంకటరమణ బొమ్మల దేవాలయం వద్ద సభ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత పంపిణీ సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. పాణ్యం మండలానికి వైఎస్సార్ ఆసరా ద్వారా 749 గ్రూప్‌లకు గాను రూ. 4, 27, 25, 530 పొదుపు సంఘాల ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు


కల్లూరు: నాడు–నేడు ఫేజ్2 పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మార్చుతుందన్నారు. మండలంలోని 12 పాఠశాలలకు నాడు–నేడు ఫేజ్–2 నిధులు వచ్చాయని, అలాగే 30 పాఠశాలలకు ఎస్ఎంఎఫ్ (పాఠశాల నిర్వహణ ఫండ్) నిధులు విడుదలయ్యాయన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకుని ఫేసియల్ అటెండెన్స్ వేయాలని, ఏదైనా కారణం చేత బయటకి వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వనజ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలోని గ్రామాలలో చేపడుతున్న గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని ఎంపీడీఓ మల్లీశ్వరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గృహ నిర్మాణాలపై నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ఇప్పటి వరకు ఓర్వకల్లు మండలం అగ్రస్థానంలో నిల్వడం హర్షించతగ్గ విషయమన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది సమన్వయంతో వంద శాతం పురోగతికి మరింత కృషి చేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రామయ్య, వర్కుఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలంప్రాజెక్ట్:సున్నిపెంట గ్రామ సమీపంలోని మోకాళ్లకురువ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి బుధవారం విషపూరిత ద్రావకాన్ని సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, ఆకుపచ్చ ప్యాంటు ధరించాడని తెలిపారు. మృతదేహాన్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్షలు నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు



ప్రగతి నివేదిక చదువుతున్న ఏఓ రవిప్రకాష్, సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోడుమూరు రూరల్: సంక్షేమ పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యం తగదని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయాలని సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఏఓ రవి ప్రకాష్ మాట్లాడుతూ రబీ కింద సాగు చేసిన పంటలన్నింటిని పంట నమోదు చేయడంతో పాటు, ఈకేవైసీ కూడా చేయిస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి కందులను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలంతా నీటిని పొదుపుగా వాడుకోవాలని, కోడుమూరు, వర్కూరు, గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని హంద్రీనదికి విడుదల చేశామని చెప్పారు. చిల్లబండలో నీటి సమస్య పరిష్కారానికి ఎర్రదొడ్డి నుంచి రూ.30 లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణం పూర్తయిందని, త్వరలో ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి నీటినందిస్తామన్నారు. పీఆర్ ఏఈ గంగరాజు మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఓ మోదీన్‌బాషా మాట్లాడుతూ వలసలు నివారించేందుకు ఉపాధి పథకం కింద కూలీలకు పనులను కల్పిస్తున్నామన్నారు. ఉపాధి పథకం కింద ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు పండ్లు, పూల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. అనంతరం సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాడి రూతమ్మ, ఎంపీడీఓ దివ్య మాట్లాడుతూ సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ గుర్రప్ప, ఏపీఎం పుష్పావతి, పశువైద్యాధికారి బాలస్వామి, మండల ఉపాధ్యక్షురాలు మాధవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్పేవే కళలు

- బాలోత్సవం ప్రారంభ వేడుకల్లో ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈవో శామ్యూల్ పాల్



విద్యార్థిని నృత్య ప్రదర్శన

కర్నూలు కల్చరల్: నైతిక విలువలు నేర్పేవే కళలని ఇన్‌చార్జ్ డీఈఓ శ్యామూల్ పాల్ అన్నారు. కర్నూలు బాలోత్సవం మూడవ పిల్లల పండుగ కార్యక్రమం నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ప్రారంభమైంది. ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీజీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యలు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, తపన ఉంటే ఏరంగంలోనైనా వంద శాతం విజయం సాధించవచ్చన్నారు. జ్ఞానం అందరిలో ఉంటుందని దానిని వెలికి తీయడమే ఉపాధ్యాయుల పని అన్నారు. సాంకేతికతను సరైన రీతిలో మాత్రమే వినియోగించుకోవాలన్నారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ.. పట్టుదల, కృషి ఉంటే మనిషి ఏదైనా సాధించగలడన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ..అపజయాలు కూడా విజయాలు సాధించడానికి పునాది రాళ్లు అవుతాయన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, బాలోత్సవం అమరావతి కమిటీ ప్రధాన కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు బడేసాహెబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి జేఎస్ శేషయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ వీబీవీ సుబ్బయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రాజు, కార్యదర్శి ఖాజా హుసేన్, సమత కన్వీనర్ రమాదేవి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

టైర్ల చోరీపై కేసు నమోదు

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామ శివారులో వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంటు వద్ద ట్రాక్టర్ల టైర్లు చోరీ కావడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 30న రాత్రి మదర్ ప్లాంటు వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్లలో మూడు ట్రాక్టర్లకు సంబంధించి ఆరు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విధితమే. ఇందుకు సంబంధించి చుట్టు గ్రామాల్లో విచారించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జూపాడుబంగ్లా: మండల కేంద్రానికి చెందిన మహబూబ్‌బాషాకు గురువారం తెల్లవారుజామున బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. తెల్లవారుజామున మసీదుకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న మహబూబ్‌బాషాను వెనుక నుంచి గుర్తుతెలియని బొలెరో వాహనం ఢీకొంది. గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం హుటాహుటినా కర్నూలు ఆసుపత్రికి తరలించారు.



రోగుల సహాయకుల వినూత్న ఆలోచన

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులు వినూత్న ఆలోచన చేశారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరలు ఏర్పాటు చేసుకుని వాటిలో సేదదీరుతున్నారు. కాలుష్య కారకాల నుంచి, క్రిమికీటకాల నుంచి తమను తాము రక్షించుకుంటున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

